క్లుప్తంగా

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు



చెన్నేకొత్తపల్లి: పాఠ్యపుస్తకాలను చూపుతున్న ఎంఈఓ-2 ప్రసన్నకుమార్ నాయుడు

చెన్నేకొత్తపల్లి: ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందజేసేందుకు అవసరమైన పాఠ్యపుస్తకాలు మండల కేంద్రానికి చేరుతున్నట్లు మండల విద్యాశాఖాధికారి-2 ప్రసన్నకుమార్ నాయుడు శుక్రవారం తెలిపారు. ఒకటి నుంచి పది తరగతులకు సంబంధించి మండలానికి 45 వేల పాఠ్య పుస్తకాలు అవసరమన్నారు. ప్రస్తుతం ఒకటి నుంచి ఏడవ తరగతులకు సంబంధించి 7,815 పుస్తకాలు సరఫరా అయ్యాయని పేర్కొన్నారు. పుస్తకాలను ప్రాథమిక పాఠశాలలో భద్రపరచినట్లు వెల్లడించారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు విడతల వారిగా త్వరలో మండలానికి చేరుతాయన్నారు. అనంతరం ఎమ్మార్సీ సిబ్బందితో కలిసి పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, శివారెడ్డి, వెంకటేష్, శివయ్య, నరసింహులు, కేశవ, పవన్ కుమార్, రమేష్ నాయక్, పుష్పలత, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



రామాంజనేయులు(ఫైల్)

కొత్తచెరువు: అప్పుల బాధ తాళలేక ఓ రైతు లోచర్ల గ్రామంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన మునిమడుగు రామాంజనేయులు(57) తన కున్న రెండెకరాల్లో మల్బరీతో పాటు నాలుగెకరాలు కౌలుకు తీసుకుని కళింగర, దోస పంటలు పండించేవాడు. అయితే రెండేళ్ల నుంచి పంట దిగుబడి రాలేదు.పంట పెట్టుబడులు, తన ఇద్దరు కుమార్తెల పెళ్లికి దాదాపు రూ.12 లక్షల వరకూ అప్పుడు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక శుక్రవారం తెల్లవారుజామున పశువుల షెడ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజారమేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కదిరి టౌన్: గాండ్లపెంట మండలం కమతంపల్లి సమీపంలో శుక్రవారం ద్విచక్రవాహనం బోల్తా పడి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. తాళ్లకాలువకు చెందిన మహ్మద్ అలీ ద్విచక్రవాహనంపై కదిరికి బయలుదేరాడు. కమతంపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచ్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

టపాసులు సీజ్



టపాసులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ముదిగుబ్బ: ఎనుములవారిపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను సీజ్ చేసినట్లు పట్నం ఎస్ఐ నరసింహులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలలో తనిఖీలు చేస్తుండగా సూర్యనారాయణరెడ్డి అక్రమంగా టపాసులను నిల్వ ఉంచినట్లు సమాచారం అందిందన్నారు. ఆయన ఇంట్లో సోదాలు చేసి ఒక గదిలో నిల్వ ఉంచిన రూ.70వేలు విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా టపాసులు, పెట్రోలు, డీజిల్‌ను నిల్వ ఉంచుకుంటే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నాణ్యమైన విత్తనకాయలు అందించండి



విత్తనకాయల నాణ్యతను పరిశీలిస్తున్న ఏడీఏ

ముదిగుబ్బ: రైతులకు నాణ్యమైన వేరుశనగ విత్తనకాయలు అందించాలని ఏడీఏ సత్యనారాయణ విత్తన ఏజెన్సీలకు సూచించారు. శుక్రవారం ఆయన జేకేపల్లి, సంకేపల్లిలో వేరుశనగ విత్తన నాణ్యతను, విత్తన రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కే-6, కదిరి లేపాక్షి-1812(వేమన) టీసీజీఎస్ 1694(వశిష్ట) వేరుశనగ రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ విత్తన కాయలను దుర్వినియోగం చేస్తే వ్యాపారస్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మీనరసింహులు, ఏఈఓ షరీఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువు.. పంటకు ఆదరువు!

- పశువుల పేడతో ప్రయోజనం
- అధిక దిగుబడి అవకాశం
- భూసారం పదిలం



పంట పొలాలకు పేడ ఎరువును తరలిస్తున్న పోట్లమర్రి రైతులు

బత్తలపల్లి: రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు రకరకాల రసాయన ఎరువులు వాడుతుంటారు. కానీ పంటల దిగుబడి తగ్గడంతో పాటు భూసారం క్షీణించి పోతోంది. ఈ రసాయన ఎరువులతో రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో గతంలో చేసిన పొరపాట్లే మళ్లీ మళ్లీ చేయకుండా ఈ ఖరీఫ్‌లో సేంద్రియ ఎరువైన పశువుల పేడ వాడాలని, ఇది పంటలకు ఎంతో ప్రయోజనమని మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి పేర్కొంటున్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలకు చెందిన రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యతను తెలియజేశారు. వివరాలు ఆయన మాటల్లోనే.. పశువుల ఎరువు, వర్మీకంపోస్టు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల ఎరువును సేంద్రియ ఎరువుగా చేసుకోవచ్చు. సేంద్రీయ ఎరువుల్లో ఉన్న పోషకాల శాతాన్ని తెలుసుకుని తగిన మోతాదులో దశల వారిగా వేస్తు పంటలు పండిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. దిగుబడులు సైతం పెరుగుతాయి. భూసారం అభివృద్ధి చెందుతుంది.

దుక్కిదున్నక ముందే..

పశువుల పేడను దుక్కులు దున్నకునే ముందు నుంచే పంట పొలాల్లో వేసుకుంటే చాలా మంచిది. దుక్కులు దున్నాక పశువుల పేడ పంట ఎదుగుదల మొక్కలు బలంగా ఉండేందుకు ఉపయోగపడుతుంది. ఒక్కో ఎకరానికి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ లోడ్ల పశువుల పేడను ఎరువుగా ఉపయోగించాలి. సేంద్రియ ఎరువైన పశువుల పేడకు పంట పొలాల్లో పోయడంతో ఆ భూముల్లో భూసారం పెరుగుతుంది. పంట సాగుకు జీవితకాలం సరిపోతుంది. భూమి గుల్లబారుటలో తోడ్పడుతుంది. సహజ సిద్ధమైన లవణాలు పంటలకు అందుతాయి. భూమిలో ఉన్న అమ్ల, క్షారాల స్థాయిని నిలబెడుతుంది. అంతే కాకుండా నేలలోని నుంచి సూక్ష్మజీవుల వృద్ధికి తోడ్పడుతుంది. మొక్కలకు అవసరమయ్యే నత్రజని, భాస్వరం, పొటాషియం, బోరాన్, జింక్ కాల్షియం వంటి పదార్థాలు సేంద్రీయ ఎరువులో లభిస్తాయి. రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చేలా దోహదం చేస్తుంది. దీంతో రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. పంటల సాగుకు ఖర్చు కూడా తక్కువ అవుతుంది. పశువుల పేడతో పంటల దిగుబడి పెరిగి రైతు లాభపడతాడు.

పంటలకు పోషకాలు..

పంటలకు ప్రధానంగా నత్రజని, భాస్వరం, పొటాష్(ఎన్-పీ-కే) పోషకాల(మైక్రో న్యూట్రియంట్స్) అవసరం ఉంటుంది. పశువుల ఎరువులో 05-15 నత్రజని, భాస్వరం 08-09, పొటాష్ 05-19, కోళ్ల ఎరువులో నత్రజని 23-30, భాస్వరం 18-20, పొటాష్ 1-2, గొర్రెలు, మేకల ఎరువుల్లో నత్రజని 02-07, భాస్వరం 04-06, పొటాష్ 01-30, వర్మీకంపోస్టులో నత్రజని 15-30, భాస్వరం 16-22, పొటాష్ 11-15 పోషకాలు ఉంటాయి. సేంద్రీయ పోషకాలతో పాటు సిఫారసు చేసిన విధంగా రసాయన ఎరువులు వేసుకోవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం



గ్రామాల్లో రైతులకు సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులు సేంద్రియ ఎరువులను తయారు చేయు విధానంపై ఉపాధి హామీలో వర్మీకంపోస్టు షెడ్లు నిర్మిస్తున్నారు. రైతుల పొలాల్లో సేంద్రీయ ఎరువులను తయారు చేసుకోవచ్చు. రైతులు తప్పనిసరిగా షెడ్లు నిర్మించుకోవాలి.

–ఓబిరెడ్డి, వ్యవసాయాధికారి, బత్తలపల్లి

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

అమడగూరు: మండలంలోని శీతిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. మొదటిరోజున మొదటి సంవత్సరం విద్యార్థులు 20 మంది హాజరయ్యారు.

సజావుగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష

ఓడీచెరువు: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష సజావుగా జరిగింది. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 26 మందికి గాను 12 మంది, విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో 47 మందికి గాను 17 మంది హాజరైనట్లు డీఓలు రిజ్వానుల్లా ఖాన్, రవీంద్రనాయుడు తెలిపారు.

కదిరి అర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలల్లో మొత్తం 4 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. జెడ్పీహెచ్ఎస్ ఏ సెంటర్‌లో 99 మందికి గాను 40 మంది, బీ సెంటర్‌లో 84 మందికి గాను 38 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఏ సెంటర్‌లో 67 మందికిగాను 26 మంది, బీ సెంటర్‌లో 67 మందికి గాను 23 మంది హాజరయ్యారు.

'నాడు-నేడు' పనుల్లో వేగం పెంచాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: నాడు-నేడు పనుల్లో వేగం పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి సూచించారు. శుక్రవారం మండల వ్యాప్తంగా జరుగుతున్న నాడు-నేడు పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాడు-నేడు నోడల్ సిబ్బందితో సమీక్షా సమాశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలల్లో పని చేస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది, ఎమ్మార్సీ సిబ్బంది వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. నాడు-నేడు పనుల పురోగతిపై ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్షించారు. పాఠశాలలు పునః ప్రారంభంలోపు పెండింగ్ లేకుండా పనులు పూర్తి చేయాలని డీఈఓ సూచించారు. వారం వారం పనుల పురోగతిని తమకు పంపాలని ఆదేశించారు. పనులకు సంబంధించి వాడే వస్తువులు, సిమెంట్, ఇసుక తదితర వస్తువులు నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే సమయానికి పనులు పూర్తి చేస్తే విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరవుతారన్నారు. పనులు, బిల్లుల పెండింగ్ తదితర వాటిపై అధికారులతో చర్చించారు. సమావేశంలో ఎంఈఓ-2 ప్రసన్నకుమార్ నాయుడు, ఎమ్మార్సీ సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల అడ్మిషన్లపై సర్వే



దివ్యాంగ విద్యార్థుల సర్వే నిర్వహిస్తున్న ఎంఈఓలు గోపాల్‌నాయక్, రాజేశ్వరి

ధర్మవరం అర్బన్: దివ్యాంగ విద్యార్థులను బడిలో చేర్పించేందుకు సర్వే చేస్తున్నామని ఎంఈఓలు గోపాల్‌నాయక్, రాజేశ్వరి తెలిపారు. ధర్మవరం మండలంలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థుల ఇళ్ల సర్వే చేసి విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ మండలంలో 320 మంది దివ్యాంగుల పిల్లలున్నారని వారిలో ఇప్పటిదాకా 175 మంది వివిధ పాఠశాలల్లో చేరారన్నారు. సర్వేలో 25 మంది విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించామని తెలిపారు. మిగిలిన వారిని గుర్తించి పాఠశాలలో చేర్పిస్తామన్నారు. దివ్యాంగ పిల్లలకు పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ అయితే వారికి ఎస్కార్ట్ అలవెన్స్ కింద ఏడాదికి రూ.3 వేలు, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కింద రూ.3వేలు, బాలికల స్టైఫండ్ రూ.2 వేలు, కళ్లులేని వారికి బ్లైండ్ లీడర్ కింద రూ.3 వేలు సర్వ శిక్ష అభియాన్ ద్వారా ఇవ్వనున్నామని తెలిపారు. ఐఈఆర్‌టీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు, ధర్మవరం ఐఈఆర్‌టీ సరస్వతి, మల్లికార్జున పాల్గొన్నారు.

దేవతా ఉద్వాసన పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలో లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవతా ఉద్వాసనను పూజలను వేదమంత్రాల నడుమ అర్చకులు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా ఏటి గంగమ్మ తిరునాల

తలుపుల: మండల కేంద్రం సమీపంలోని ఏటి గంగమ్మ ఆలయం వద్ద మొలకల పౌర్ణమి సందర్భంగా తిరునాల ఘనంగా జరిగింది. ఈసందర్భంగా మొలకలు, జ్యోతుల ఊరేగింపు చాందిని బండి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

కదిరి టౌన్: పట్టణంలోని 11కేవీ డీ4 ఫీడర్ నిర్వహణ నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ చెన్నకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఎన్‌జీఓ కాలనీ, సాయిబాబా ఆలయ వీధి, వాణివీధి, రాజేంద్ర ప్రసాద్ వీధి, బండారు నగర్, ఇందిరానగర్, సైదాపురం ఎస్సీకాలనీ, డిగ్రీ కాలేజ్ ఎదురుగా, అభిరుచి డాబా ఏరియా, ఎర్రగుంటపల్లి, కుమ్మరోళ్లపల్లి, కుటాగుళ్ల రైల్వేగేటు వరకు, జగనన్న కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఉచితంగా మందుల పంపిణీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సుబ్బదాసు సత్రంలో శుక్రవారం సత్యసాయి భజన మండలి సభ్యులు నారాయణసేవలో భాగంగా ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం 400 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు సాంబశివుడు, వెంకటేష్, నాగిరెడ్డి, ఆచారి, జనార్దన్, కాకుమాని సాగర్, గజ్జల అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పసిబాల చిన్నమ్మ పరుష



పసిబాల చిన్నమ్మ మూల విరాట్ (ఫైల్)

నల్లమాడ: మండలంలోని తుమ్మలామల దుర్గంలో వెలసిన మహిమాన్వితురాలు పసిబాల చిన్నమ్మ స్వామి పరుష శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు వంకరకుంట గ్రామపెద్దలు మాజీ డీసీఎంఎస్ టీ.కేశవరెడ్డి, మాజీ సర్పంచ్ కే.జయంత్ రెడ్డి, సర్పంచ్ టీ. కుల్లాయప్ప, ఎంపీటీసీ ఎం. సుగుణమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు శనివారం దాసంగాలు, పరుష ప్రారంభం, 26న విడిదినం, 27న సోమవారం బసిరెడ్డిపల్లి నుంచి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటలకు స్వామి గుట్ట వారి బాయి నుంచి చిన్నమ్మ గుడి చేరుట. రాత్రి 8 గంటలకు చిన్నమ్మ గుడిలో భజన కార్యక్రమం, చిన్నమ్మ పద్యం చెప్పుట, యలవ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తర్వాత 28న బండ్లు, రాత్రి 9 గంటలకు మేటి కళాకారులచే పంచరత్నాలు ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శన, 29న సాయంత్రం 4 గంటలకు కుంకాలు, పరుష ఆఖరి రోజు, 30న గురువారం వంకరకుంట గ్రామం నుంచి మధ్యాహ్నం 12 గంటలకు ఊరేగింపుగా చిన్నమ్మ దేవత బత్తినిపల్లికి పయనమైపోవుట ఉంటుందని తెలిపారు. బత్తినపల్లి, వీరేపల్లిపేట గ్రామాలకు చెందిన చిన్నమ్మ పూజార్లు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు జరుగనున్నట్లు పేర్కొన్నారు.

అల్లర్లను ప్రోత్సహిస్తే ఉపేక్షించం



గంగినేపల్లిలో సోదాలు చేస్తున్న పోలీసులు



తూంచర్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్ఐ నరేంద్ర

చెన్నేకొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెలువడిన తరువాత గ్రామాల్లో అల్లర్లను ప్రోత్సహించి, గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని గంగినేపల్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత నేరస్తులు, నేర చరిత్ర కలిగిన వారి ఇళ్లలో సోదాలు చేపట్టారు. పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులు, రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ రోజు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని.. ఎక్కడా సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుమతి లేదని తెలిపారు. పోలీసుల హెచ్చరికను పాటించకుండా గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగా లేని నాలుగు వాహనాలను సీజ్ చేశారు.

ఓబుళనాయనపల్లిలో కార్డెన్ సెర్చ్

ధర్మవరం రూరల్: సమస్యాత్మక గ్రామమైన ఓబుళనాయనపల్లిలో శుక్రవారం రూరల్ ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి పాడుబడిన ఇళ్లు, గడ్డివాములు, ముళ్ల పొదలు తదితర వాటిలో పోలీసులు ముమ్మురంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలలో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్న కారణంగా గుంపులు గుంపులుగా ఎవరూ ఉండకూడదన్నారు.

ఊరేగింపులు, ర్యాలీలు నిషిద్ధం

కనగానపల్లి: రాజకీయ వైషమ్యాలతో గ్రామాల్లో అనవసరంగా గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తూంచర్ల గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎన్నికల కౌటింగ్ తర్వాత గ్రామాల్లో ఎవ్వరూ బాణాసంచా పేల్చటం, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించటం నిషేధమన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎక్కడా గుంపులుగా తిరగటం, సమావేశాలు పెట్టుకోవటం చేయరాదన్నారు. పోలీస్ నిబంధనలు అతిక్రమించి ఎవ్వరైనా ప్రవర్తిస్తే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుకాణాల్లో పెట్రోలు, డీజిల్ విక్రయిస్తే చర్యలు

బత్తలపల్లి: దుకాణాల్లో పెట్రోలు, డీజిల్ విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని రామాపురం, సూర్యచంద్రాపురం, నల్లబోయనపల్లి, సంజీవపురం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా కిరాణా దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇకపై దుకాణాలలో పెట్రోలు, డీజిల్ ఉన్నట్లు తెలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్ఏ మృతి



వెట్టి నరసింహులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రామగిరి(చెన్నేకొత్తపల్లి): రామగిరి మండలం నసనకోటకు చెందిన వీఆర్ఏ వెట్టి నరసింహులు (75) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సూచనలతో బాబురెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరసింహులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుమారుడు రామగిరి మండలం సొసైటీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున, కన్వీనర్ కద్రా హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యల్లమ్మ తిరునాల



యల్లమ్మ అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న భక్తులు

ఎన్పీకుంట: మండల కేంద్రంలో నాలుగు రోజులుగా జరిగిన యల్లమ్మ అమ్మవారి తిరునాల శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో జ్యోతులు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నల్లగంగమ్మకు బోనాలు:

మొలకలపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని నల్లగంగమ్మ ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున భక్తులు అమ్మవారికి బోనాలు పట్టారు. డీజే పాటలతో, డప్పు, వాయిద్యాల మధ్య పెద్ద సంఖ్యలో మహిళలు ఊరేగింపుగా అమ్మవారికి బోనాలు తీసుకొచ్చారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం అనంతరం బోనాలు సమర్పించి ప్రసాదంగా స్వీకరించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, పాడి పంటలతో ఈ ప్రాంతం విరజిల్లాలని మొక్కుకున్నారు.

గ్రామాల్లో 'డ్రైడే ఫ్రైడే'

తాడిమర్రి: తాడిమర్రి, కునుకుంట్ల, పెద్దకోట్ల, ఎం.అగ్రహారం, నార్శింపల్లి, పిన్నదరి, దాడితోట, చిల్లవారిపల్లి తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది శుక్రవారం డ్రై డే ఫ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లోని వీధుల్లో పర్యటిస్తూ మురుగు నీటి గుంతలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం వారు ఇంటింటా పర్యటిస్తూ నీటితొట్టెల్లో నిల్వచేసిన నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత లోపిస్తే దోమలు ప్రబలి తీవ్ర జ్వరాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ దోమలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలనకు అనుమతి

ధర్మవరం అర్బన్: స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పరిశీలనకు జిల్లా కలెక్టర్ అనుమతినిచ్చారని ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేపాక్షి మండలం చోలసముద్రంలోని నాయనపల్లిక్రాస్ వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లోని బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లను పరిశీలించేందుకు ఉదయం 10 నుంచి 11 గంటలు, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఎమ్మెల్యే అభ్యర్థులు లేదా వారి తరఫున ఏజెంట్లు పరిశీలించవచ్చని పేర్కొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

బత్తలపల్లి: ప్రస్తుతం మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు వడదెబ్బకు గురికాకుండా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. నీటిని ఎక్కువగా సేవిస్తుండాలన్నారు. సులభంగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.